క్లుప్తంగా

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి



విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తపల్లి: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా అన్నారు. పాత ఇసుకపల్లి శివారు ఉప్పరగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం రాగిజావ తాగేందుకు ప్రభుత్వం అందించిన స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుర్రాల మంగతాయారు, సన్నిబోయిన ఎలీషా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఇసుకపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు యరకం నూకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

పెద్దాపురం: పెద్దాపురం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బెన్నియ్యనాయుడు బదిలీ అయ్యారు. కడప జిల్లా రాజంపేట కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సరస్వతి బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ కావడంతో బెన్నియ్యనాయుడు తెనాలి కోర్టుకు బదిలీపై వెళ్లనున్నారు.

పెంకు పురుగుల నుంచి రక్షించాలి



హుస్సేన్‌పురం ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

సామర్లకోట: పెంకు పురుగుల బెడద నుంచి రక్షణ కల్పించాలని హుస్సేన్‌పురం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం హుస్సేన్‌పురం వెంకట్రామ ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద ఆ గ్రామానికి చెందిన యువకులు ధర్నా చేశారు. ఫ్యాక్టరీలో తవుడు నిల్వ చేయడం వల్ల పెంకు పురుగులు పెరిగిపోయి అవి గ్రామంలోని ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంకు పురుగులను నివారించాలని ఫ్యాక్టరీ యజమాన్యానికి వినతి పత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ మార్ని నాగమణి ఆరోపించారు. ఈ మేరకు గ్రామ ప్రజలు ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేశారు. ఇప్పటికీ స్పందించక పోతే జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యను తెలియజేస్తామని గ్రామస్తులు తెలిపారు.


పోటీతత్వం అలవర్చుకోవాలి



ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువకులను సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గ్రంథాలయ అధ్యక్షుడు బాదం సూర్యప్రకాష్ అన్నారు. స్థానిక సూర్యరాయ విదానంద గ్రంథాలయంలో బుధవారం ప్రభుత్వ రైల్వే ఉద్యోగాలు సాధించిన యువకులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షల విభాగంలోని 8 మంది విద్యార్థులు గ్రూప్–డీ పరీక్షల్లో ఉత్తీర్ణులై రైల్వే ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందించదగిన విషయమన్నారు. ఈ పోటీ పరీక్షల విభాగంలో శిక్షణ పొంది ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగి వెన్నపు చక్రధరరావు, గ్రంథాలయ ఉపాధ్యక్షుడు బాదం కృష్ణారావు, కార్యదర్శి కొండేపూడి చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



అదృశ్యమైన నవ్య

సామర్లకోట: స్థానిక గణేష్ కాలనీకి చెందిన ఒక వివాహిత అదృశ్యం అయినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గంట నవ్య, భర్త ప్రసన్నకుమార్‌తో ఈనెల 15న ఘర్షణ పడింది. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నవ్య తిరిగి రాలేదు. దాంతో భర్త ప్రసన్నకుమార్ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నవ్య ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబరు 94407 96568, 97016 26505ను సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌ను కలసిన రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న

కాకినాడ సిటీ: జిల్లా పర్యటన నిమిత్తం కాకినాడ వచ్చిన రాష్ట్ర రజక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుగుమంచిపల్లి రంగన్న బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి పి.సత్యరమేష్ తదితరులు ఉన్నారు.



నాడు: పిఠాపురం విద్యుత్ నగర్‌లో అధ్వానంగా రోడ్డు



నేడు: అద్దంలా మెరిసిపోతూ..



నాడు: కొండప్ప వీధిలో గుంతలతో రహదారి



నేడు: అభివృద్ధి చేసిన తర్వాత

సమకూరిన నిధి

- గడప గడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు మోక్షం
- శరవేగంగా అభివృద్ధి పనులు

పిఠాపురం: ఆప్యాయంగా పలకరిస్తూ... అందరి సమస్యలు తెలుసుకుంటూ.. మేమున్నామని భరోసా ఇస్తూ.. సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది.. ఇందులో నేతల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకూ మోక్షం లభిస్తోంది.. పిఠాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు 157 రోజులుగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం జరిగిన ప్రతి సచివాలయ పరిధికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు కావడంలో అక్కడ అభివృద్ధి పనులకు బాటలు పడుతున్నాయి. బాబూ... నువ్వు మా ఎమ్మెల్యే దొరబాబువేనా ఎలా ఉన్నావు.. అంటూ గడప గడపకూలో ఓ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే పెండెం దొరబాబును ఓ వృద్ధురాలు పలకరించింది. అవును అవ్వా నేనే మీ ఎమ్మెల్యేనే మన ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవడానికి వచ్చాను అనగానే, అన్ని ఇంటికే తెచ్చి ఇస్తున్నారు బాబూ.. అంటూ ఆమె ఆనందంగా చెప్పింది. ఇలా ఏ ఇంటికి వెళ్లినా ఆప్యాయ పలకరింపులే.. వ్యక్తిగతంగా చిన్న సమస్యలున్నా వాటిని అక్కడికక్కడే అధికారులకు చెప్పి తీర్చుతుండడంతో పాటు ప్రధాన సమస్యలకూ పరిష్కారం చూపిస్తున్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడంతో గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలైన రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వసతి వంటివి వెంటనే కల్పిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తెలుసుకుంటున్న సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి

పిఠాపురంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండడంతో రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారుతున్నాయి. రహదారుల దుస్థితిని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి స్థానికులు తీసువెళ్లారు. దీంతో ఆయన ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులతో రోడ్ల నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. ఇప్పుడు రోడ్లు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉన్న రహదారులను పూర్తిగా అభివృద్ధి చేయడంతో అద్దంలా మెరిసిపోతున్నాయి. ప్రధాన రహదారుల సమస్యకు పరిష్కారం చూపిన ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అలాగే కాలువ నిర్మాణాన్ని చేపడుతున్నారు. మురుగు సమస్యలకు మోక్షం కల్పిస్తున్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇవ్వండి



ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సామర్లకోట: స్థానిక బలుసులపేటలో చర్చి గోడ కూలి మృతి చెందిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం అందజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చర్చి గోడ కూలి పోయిన ప్రదేశాన్ని సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్సు యూనియన్ నాయకులు బుధవారం సాయంత్రం పరిశీలించారు. చర్చిలో కూలి పని చేస్తున్న ప్రదేశంలోని గోడ కూలి ముగ్గురు గాయపడగా వారిలో ఇద్దరు మృతి చెందడం బాధకరమని యూనియన్ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు, సీపీఎం పట్టణ కార్యదర్శి కరణం ప్రసాదరావు అన్నారు. బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోవాలన్నారు. ఆయా సంఘాల నాయకులు ప్రకృతి ఈశ్వరరావు, పెనుపోతుల సత్తిబాబు, కోనా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పాత ఇసుకపల్లి శివారు ఉప్పరగూడెం, యండపల్లి శివారు తోటూరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే కొలమానంగా పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మనం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. నాడు– నేడుతో పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. 2024లో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసి మరింత అభివృద్ధి సాధించుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ చల్లా ప్రభాకరరావు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.15 వేలకు పెంచే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే దొరబాబు పరిశీలించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని ఉపాధ్యాయురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నూతన భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచులు సన్నిబోయిన రిబ్కా, శ్రీలం పెదఅప్పారావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ గుర్రాల మంగతాయారు, ఇసుకపల్లి, యండపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు యరకం నూకారెడ్డి, గుండ్ర రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా భవనానికి రూ.1.7 కోట్ల మంజూరు



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలసిన ఎంపీ గీత

పెద్దాపురం: పెద్దాపురంలోని తపాలా కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.7 కోట్లు మంజూరైనట్టు ఎంపీ వంగా గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 1956లో తపాలా భవనాన్ని నిర్మించారని, నూతన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను నిధులు కోరామని, ఆ మేరకు ఈ కార్యాలయాన్ని మొదటి ప్రాధాన్యంగా గుర్తించి నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో ఇంజినీరింగ్ శాఖ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సత్వరం స్పందించాలి



ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

- ఆర్డీఓ సీతారామారావు
- డివిజన్ స్థాయి సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం

పెద్దాపురం: ఎస్సీ, ఎస్టీ సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ స్పందన హాలులో బుధవారం డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాన్ని డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తో కలసి నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌కు సంబంధించి 12 మండలాల పరిధిలో ఎస్సీ, ఎస్టీల కేసుల్లో ఎఫ్ఐఆర్ స్థాయిలో 120, చార్జ్‌షీట్ స్థాయిలో 61, పోస్టుమార్టమ్ స్థాయిలో రెండు కేసులకు రూ.1.42 కోట్లు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసిందన్నారు. అనంతరం మండలాల వారీగా ఉన్న కేసులు వివరాలపై సమీక్షిస్తూ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబధించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు పూర్వాపరాలు పూర్తై బాధితులకు న్యాయం జరిగే వరకు సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ హిమమహేశ్వరి, డివిజన్‌లోని నాలుగు నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మోకా పవన్‌కుమార్, త్రినాథ్ దేవ్, డివిజన్ కమిటీ సభ్యులు దడాల బాబ్జీ, గారా శ్రీనివాస్, డివిజన్‌లోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

మమ్మేలు తల్లీ..

- గ్రామాల్లో ఉత్సాహంగా జాతరలు



రావివారిపోడులో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ గీత



కొండెవరంలో పెద్దింటమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: గంధ అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల జాతరలు, తీర్థాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కొండెవరంలో పెద్దింటమ్మ జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే దొరబాబు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు గాది గంగబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. వాకతిప్ప గ్రామ దేవత ఆదిలక్ష్మి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పొన్నాడ శివారు రావివారిపోడులో మహాలక్ష్మి అమ్మవారి తీర్థం జరిగింది. అమ్మవారిని ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, జక్కంపూడి రాజా, ఎంపీ వంగా గీతతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు దర్శించుకున్నారు.

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా చింతాలమ్మ జాతర

పెద్దాపురం: మండలంలోని సిరివాడ గ్రామ దేవత చింతాలమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ, మేళ తాళాలు, బాణసంచా నడుమ జాతరను ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించింది. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



ఉప్పాడలో పథకాల గురించి వివరిస్తున్న కన్వీనర్ తదితరులు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటా పర్యటించారు. యజమానుల అంగీకారంతో ఇంటి తలుపులకు జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. ఉప్పాడలో కన్వీనర్ లక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు.

నేడు వెల్ బేబీ కాంటెస్ట్

బాలాజీచెరువు: రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రోటరీ హాల్లో వెల్ బేబీ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద తెలిపారు. గ్రూప్–ఏ విభాగంలో పది నెలల వయసు నుంచి 18 నెలలు, గ్రూప్–బి విభాగంలో 18 నెలల నుంచి మూడేళ్ల వయస్సుగా విభజించి పిల్లలకు ఫొటోజనిక్ ఫేస్, స్మైల్, ఉంగరాల జుట్టు, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని బహుమతులు అందజేస్తామన్నారు. ప్రవేశాలు అందరికీ ఉచితమని ఆసక్తి గల వారు తమ పిల్లలను తీసుకు వచ్చి పాల్గొనవచ్చని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ జాహ్నవి, ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ టి.అనుపమ హాజరై బహుమతులు అందజేస్తారని తెలిపారు.

ఒకరికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో బుధవారం ఒక వ్యక్తికి కోవిడ్ నిర్ధారణ అయింది. మంగళవారం సేకరించిన 181 నమూనాలను పరీక్షిస్తే ఈ ఫలితం వెల్లడైంది. బాధితుడిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు.

స్పందన ప్రగతిపై 'జగనన్నకు చెబుదాం'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం సాయంత్రం అమరావతి నుంచి ×జగనన్నకు చెబుదాం×పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలసి పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రతి సోమవారం జిల్లాలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి శాఖల వారీగా వస్తున్న అర్జీల వివరాలు, వాటి పరిష్కారానికి అనుసరిస్తున్న విధానం, ప్రజల సంతృప్తి స్థాయి, జిల్లా స్థాయి అధికారులు తీసుకోవల్సిన చర్యలపై పూనం మాలకొండయ్య దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీవో పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, డీపీవో ఆర్.విక్టర్, హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, సివిల్ సప్లైస్ డీఎం డి.పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

రిబేటును సద్వినియోగం చేసుకోండి

- పన్ను చెల్లింపుదారులకు కమిషనర్ పిలుపు
- రూ.20 కోట్ల లక్ష్యం సాధనకు ప్రత్యేక బృందాలు
- అధికారులతో సమీక్ష
- వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశం



సచివాలయ ఉద్యోగులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ మహేష్ కుమార్



సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

కాకినాడ: ఈ నెల 30వ తేదీ లోపు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఏకమొత్తంగా చెల్లించే వారికి ఐదు శాతం రిబేట్ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్‌తో కలిసి పన్ను వసూళ్లు, రిబేటు, నీటి పన్నులపై వాటర్ వర్క్స్ అధికారులు, ఆర్వోలు, ఆర్ఐలు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. రిబేటు అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సంబంధిత ఉద్యోగులంతా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇప్పటికి సుమారు రూ.15 కోట్లు వసూలైందని, ఈ ఏడాది రూ 20 కోట్ల వసూళ్లు లక్ష్యంగా పని చేయాలన్నారు. నీటి పన్నుకు సంబంధించి ప్రస్తుత పాత, బకాయిలు వసూలు చేసేందుకు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా సచివాలయాల అడ్మిన్లు, ఎమినిటీ కార్యదర్శులు, ఏఈలు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లతో ఏర్పాటయ్యే బృందాలు నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏడీసీ నాగ నరసింహారావు మాట్లాడుతూ నగరాభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకమని, గత ఏడాది రిబేట్ ద్వారా, ఆర్థిక సంవత్సరం మొత్తం మీద పన్ను వసూళ్లలో నగరపాలక సంస్థ మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో వాటర్ వర్క్స్ డీఈ ప్రభాకర్, ఆర్ఐలు చెక్కా రమణ, నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను చెత్తమయం చేయొద్దు : ఏడీసీ

స్థానిక 38, 41 డివిజన్ల పరిధిలోని కమలాదేవి వీధి, బ్రహ్మంగారి గుడి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు తనిఖీ చేశారు. కొన్ని అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్ల పక్కన చెత్త ఉండడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందిని పిలిచి చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఇదే పునరావృతమైతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు నగరపాలక సంస్థ ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది కూడా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వర్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కార్పొరేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

అధునాతన వసతులతో విశాల ప్రాంగణంలో చేపట్టిన నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణ పనులను కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.38 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నాలుగు అంతస్తుల్లో భవనాన్ని నిర్మిస్తున్నట్లు స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు కమిషనర్‌కు వివరించారు. నూతన భవనానికి సంబంధించిన బిల్డింగ్ ప్లాన్ నమూనాను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు, కాంట్రాక్టర్, సుధాకర ఇన్‌ఫ్రా సంస్థ ప్రతినిధి వంగ పుల్లారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

కాలేయాన్ని కాపాడుకుందాం

కాకినాడ రూరల్/బోట్‌క్లబ్: మానవ శరీరంలో అతి పెద్ద గ్రంథి కాలేయమని ఇది చాలా ముఖ్యమైనదని కాలేయ సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టరు ఆదిత్య పేర్కొన్నారు. ప్రపంచ కాలేయ (లివర్) దినోత్సవం సందర్భంగా అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో, సిటీ పరిధిలోని అహోబిల ఆస్పత్రిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికవర్ యూనిట్ హెడ్ సిద్ధారెడ్డి అధ్యక్షతన, అహోబిల ఆస్పత్రిలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టరు ఆదిత్య మాట్లాడుతూ కాలేయం జీవక్రియ, రోగనిరోధక శక్తి, జీర్ణక్రియ వంటి వాటికి దోహదం చేస్తుందన్నారు. అయితే కాలేయం పూర్తగా నాశనం అయ్యే వరకు ఎలాంటి సంకేతాలను శరీరం ఇవ్వదని అందువల్ల సమస్యలు లేవని కాలేయంపై శ్రద్ధ చూపక పోతే ముప్పు తప్పదన్నారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు వెదురుపాక సతీష్, సువర్ణ, శ్రీమన్నారాయణ, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

పక్షులను రక్షిద్దాం

బాలాజీచెరువు: వేసవి కాలంలో పక్షులకు నీటితో పాటు ఆహారం అందించాలని లయన్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ పద్మతులసి సమకూర్చిన బర్డ్ ఫీడర్లను (పక్షుల ఆహారపు తొట్టి) లయన్స్ క్లబ్ సభ్యులకు పంపిణీ చేసి వాటిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కాలంలో వీటి ద్వారా పక్షులకు ఆహారం అందిస్తే వాటిని సంరక్షించడంలో భాగస్వామ్యం అవుతామన్నారు.